

# నా జీవన యానంలో

హాస్య చమత్కార పద కవితా రాగ మాలిక

సిహెచ్. వి.ఎస్. ఎన్. మూర్తి



చతుర్వేదుల. వెంకటసత్యనారాయణ మూర్తి

# ముందు మాట:

మనిషి జీవితం – ఇది అందరికీ వర్తిస్తుంది – చాల అందమైనది అని దృఢంగా నమ్ముతూ తన జీవితంలో ఒక తపనతో హృదయ పూర్వకంగా ఆ ఆనందాన్ని అద్భుతాన్ని అనుభవిస్తున్న పద కవితా రాగ మాలిక నాలాపించినవాడు యీ మా 'మూర్తి'. ఈ శరీరం భగవంతుడు మనకిచ్చిన ఒక అద్భుతమైన యంత్రాల సంకలనం. ఉపకరణం. దేనికి?....ఆనందించడానికి. 'శరీర మాద్యం ఖలు 'ధర్మ సాధనమ్'. ఆ శరీరం ఉపకరణంగా అందంగా ధర్మ బద్ధంగా, లయ బద్ధంగా యెలా ఉపయోగించుకోవాలీ అనే చక్కని సదుద్దేశ్యంతో తనకున్న పరిధిలో ఎంతో వినయంగా తన మెదడుకి మేత పెట్టాడు మూర్తి.

ముందే మర్యాదగా చదువరులకు ఒక అందమైన 'వార్నింగ్' యిచ్చాడు. 'చదువరులూ! నాకున్న ఛందో వ్యాకరణాల మిడి, మిడి జ్ఞానంతో వాటి జోలికి పోక ఆరోగ్యకరమైన హాస్యాన్ని, వ్యంగాన్ని జొప్పిస్తూ జాన పద విన్యాసాల (పద్యాల) ధోరణిలో ఓ నాలుగు పంక్తుల 'లొల్లాయి పదాల' లాంటి పద కవితను (పద్యాల) రోజుకొకటి చొప్పున వొడ్డించడానికి (అందించడానికి) సాహసం చేస్తున్నాను, ఆరగించండి. వాటిని ఆరగించి 'జీర్ణించుకోవడం మీ వంతు', అని 'లొల్లాయి పదాల' (పద్యాల – అని అనలేకపోయినా, అలాగే వున్నాయి) శీర్షికను తన 'వ్యాట్సప్ మెయిల్లో' మనకు రోజుకొకటి బట్వాడా (పోస్ట్) చేశాడీ పద కవితా భావుకుడు.

నేను చెప్పవద్దూ - కొద్దిగా ఇంకా 'గణాల గుణాలు' అని మడి గట్టుకుని కూర్చుని అవే భట్టీయం వేస్తూ వుంటున్న వాడిని. అయితే ఆ 'గణ గుణాల' థ్రిల్ వేరనుకోండి. అది చర్చనీయాంశం కాదు. 'వేమన గారి 'ఫ్రీ-లాన్స్' రచనకి లాగ ఒక చక్కటి సంస్కృతం, తెలుగులతో కూడిన 'మకుటాన్ని' – విశ్వమూర్తివి కాని (కాదొకో / కాదురా) వినుర మూర్తి' అనే మకుటాన్ని చేర్చి మొదటి ఆరగింపు వొడ్డించాడు. మకుటం 'తేటగీతి' కి దగ్గరగా వుందని కొద్దిగా ఆనందపడి మిగతా పదాల లోని సరుకుని (substance) చదివి, ముచ్చటపడ్డాను. నా 'మడి' అనే 'దడి' ని కొద్దిగా పక్కకు తప్పించి చూసి 'అబ్బా!' అనుకున్నాను.

ప్రారంభ భావుకతా కవితలోనే 'ఆలి' 'రంభ'లకు సామాన్యుడి చెప్పుకునే సామెత లాంటి 'ఉట్టికే ఎక్కలేనమ్మ స్వర్గానికి ఎగ బాకటమన్న....' నానుడిని ఉపమాలంకారంగా వాడేశాడు. 'ఆలిని' సాకలేకపోవడం ఉట్టిని ఎక్కలేకపోవడంతోనూ – అలాగే 'రంభ' ను తలపులతో తలవడం స్వర్గారోహణం తోనూ పోల్చాడు. ఈ పోలిక చాలా సామాన్యంగా అందరికీ అర్థం అయ్యేలా చిరు హాస్యంతో వున్నది. అయితే 'ఆలిని, రంభ' ని మనసులోకి కవిత రూపేణ జొప్పించేసరికి ఎంత నా తల 'బోడి' అయినా 'తలంపు' బోడి కాదు గదా! నాకూ హుషారొచ్చేసింది. అయినా సరే, తొందర పడొద్దు రెండోది కూడా చూదాం అని ఆగాను.

రెండోది బట్వాడా అయింది. 'విషయ పరిజ్ఞానం – ఆచరణ; మందు చీటీ – బట్టీయం (memorize)'. ఈ పోలిక చాల చక్కగా సామాన్యంగా పామరుడుకి కూడా అర్థం అయ్యేలా వుంది. అలాగే 'సంతు చెడ్డ దోవ పడినప్పుడు వగచి యేమి లాభము'. నేటి తలిదండ్రులకొక సుతిమెత్తని హెచ్చరిక! అతగాడు కూడా ఒక ఆడపిల్ల తండ్రే కదా! అలాంటి 'చురక' వేయడం తన సంఘ బాధ్యత (సంఘ ధర్మం) అనుకున్నాడు. సంతోషం! మనలో వున్న 'భావ దారిద్ర్యాన్ని' సున్నితమైన హాస్యంతో సంఘ పరంగా చూపించాడనిపించింది.

'......మట్టి పాత్ర లెన్ని రూపులయిన మూలము పుడమే కదా... మూర్తులన్నింటిని .....పేర్ల కొలువయేని .......మూర్తులన్నింటి మూలము 'పరమాత్మయే' కదా! 'సత్యాన్ని' చాల ఆర్భాటం లేకుండా చెప్పాడని నాకనిపించింది. చంద్రహారం అవొచ్చు, వజ్రాలతో పొదిగిన చేతి గాజు అవొచ్చు,వొడ్డాణమవొచ్చు, కాసులపేరవొచ్చు వీటన్నింటికి మూలము 'బంగారమే' కదా!' అలాగే ఏ వస్తువైనా ఆ 'ఆత్మ' శక్తే కదా! 'ఈశావాస్యమిదగ్ం సర్వం' అనే శృతి వాక్యం స్ఫురించడం లేదూ. ఈశ అంటే ఆ 'పరమాత్మే' కదా! అలా నాకనిపించడ మేమిటి, మీకూ అనిపించి తీరాల్సిందే!

అవతారాలు లోకంలో దుశ్చర్యలతో విర్రవీగుతున్న రాక్షసులను వేటాడి తునిమినప్పుడు, మనం దసరా (దశ హరా) అని, దీపావళి...ఘనంగా లక్షలు,కోట్లు ఖర్చుపెట్టి పండగ చేసుకోవడం కద్దు! అవునా? అలాగే ఒక సినీమా (ప్రదర్శనలో) నాటకీయంగా కథా నాయకుడు ప్రతినాయకుడు అతని బృందాన్ని ఒంటి చేత్తో ముష్టి ఘాతాలు తగిలిస్తూ వుంటాడు. 'క్లాస్' సీటులో కూర్చున్న 'మనవాడు' సినీమాలో లీనం అయిపోయి, తనే నాయకుడనుకుంటూ వాడి - ప్రతి నాయకుడి 'దుశ్చర్యల'ను నిరసిస్తూ తన సీట్లోంచి లేచి ఉద్రేకంతో బలంగా చేతులాడించేస్తూ గాలిలో విన్యాసం చేస్తూ ఆనందిస్తూ, ఆ ఉద్రేకాన్ని ఆస్వాదిస్తూ పక్కన వున్న ప్రేక్షకులని పట్టించుకోకుండా 'స్వైర విహారం' చేస్తూ హుషారుగా వుంటాడు సినీమా హాల్లోనే. వాడి బలమైన చెయ్యి పొరబాటున పక్కవాడి మీద పడిందనుకొండి ఇక చెప్పనక్కర లేదు, మొత్తం వ్యవహారమే 'భశుమ్'.

నటించే ప్రతినాయకుడి దుశ్చర్యలను సహించలేని యీ పెద్దమనిషి, సినీమా హాల్లోనుంచి బయటకు రాగానే తన నిజ జీవితంలోని 'దుశ్చర్యలను' విచారణ చేసుకుని తునుముకోగలడా? దానికెందు కాలస్యం చేయడం. ఇది స్ఫురిస్తూ 'తానూ మాత్రము తనలోని చెడ్డను దునుమ జాగు చేయగానేల?' అంటూ తన నిర్వేదాన్ని తనే పాడుకున్నాడీ పద తునకల్లో. ఆ జాగు తన మూలాధార చక్రంలోని 'తామసగుణ' మహిమ అని మనం సర్దుకు పోవాలనే సూచన అనిపించింది నాకు. ఇది సగటు మనుషులందరికీ వర్తిస్తుంది కాదా?

ఇది చూడండి ఎంతటి చక్కని సత్యమో! 'ఆ అల్పజీవి' తేనెటీగ పాటి చేయడే యీమనిషి తోటివానికి చేత నివ్వగా –

అల్పుడెవరిం దులో?' అని బాధ్యతతో ప్రశ్నించాడు. ఇలా మన నిజజీవితంలోని ఎన్నెన్నో సమస్యలను సందర్భోచితంగా గుర్తు చేస్తూ గానం చేయగలిగాడు.

మన  జీవితకాలాన్ని యెలా పెంచుకోవచ్చునో చాల తేలికగా హాయిగా చెప్పాడు – 'హాస్యగ్రంథులున్నను చాలు -ఆ మనిషి జీవిత కాలము హెచ్చు' నిజమే కదా! ఛార్లీ ఛాప్లిన్, లారెల్ – హార్డీ, మిస్టర్ బీన్స్  (రోవన్ అట్కిన్) మన రేలంగి, పద్మనాభం, బాలకృష్ణ  గార్లను ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోండి.

జీవితము వేరు జీవించు విధము వేరు- తొలుతది పరమాత్మ యిచ్చినది – తదుపరిది మనమెంచుకున్నది. **(Life is different and Living is different, Life is a gift from the Supreme Consciousness the GOD while Living is your choice which is at your discretion.** నిజమే కదా! మన జీవనవిధానానికి ఆ దైవం మనకు కావలసిన వివేక,విచక్షణా జ్ఞానాలని వరంగా యిచ్చాడు.వీటిని వాడుకోవాలి గాని 'ఇందున తేడాలు జరిగిన గాని, హెచ్చు తగ్గులొచ్చిన గాని పరమాత్ముడిని బాధ్యుడిని చేయ ఏమి సబబు - ఎంత నోరులేని వాడయినను? అని మళ్ళీ రచయిత తన హెచ్చరికను మన మీదకు తోశాడు.

చివరగా.... 'ఉల్కలు నేల రాలిన వాటి జాడయే తెలియజాల! అట్టిది మనబోంట్లమానవులకీ వులుకుబాటు తగునే?' అని మర్యాదగా మందలించినట్లు గానం చేసుకున్నాడీ మూర్తి పద (పద్య) కవితా విహారి. దైనందిన జీవితంలో తటస్థపడే నిజాలనే నిర్భయంగా నిర్ద్వంద్వంగా చెప్పగలిగాడు.

మొత్తంమీద తన యీ ఆరుపదుల జీవితంలో బాగానే వడపోశాడనిపించింది. నేను 'సాంపిల్' గా ఓ అరడజను గారెలు, బూరెలనే ఏదో విశ్లేషించి మీకు నాశక్తి కొద్దీ వడ్డించగలిగాను. అయితే ప్రతి సంకలనంలోనూ తను నమ్మిన ఒక ధనాత్మక (positive) సదుద్దేశపూర్వక స్ఫూర్తినందించే సూత్రాన్నే మనకు బహుమతిగా అందించాడు. ఏమని? 'జీవితం చాలా అందమైనది...అది మన చేతుల్లో...చేతల్లో...' అదే ఇంగ్లీషులో అదే అర్థం వచ్చేటట్లుగా **'Life is always beautiful It all depends.....” Hinting that your living – manner of living is in your hands and you are the architect of your own life. As your thought, word and deed so your life.**

ఒక బాధ్యత కల రచనలో ఇంతకంటే ఏం కావాలి, నాలాంటి చివరి 'పాతిక' (?) లో వున్నవారికి మా ప్రయాణంలో మాకు జరిగిపోయిన సంఘటనలను గుర్తు చేశాడు. మొదటి 'పాతికలో' వున్నవాళ్లకి వాళ్ళ మిగతా మూడు పాతికల ప్రయాణంలో  జరగబోయే సంఘటనలను ఒక 'హెచ్చరికగా' అది సలహా రూపంలో ఎవరూ నొచ్చుకోకుండా చెప్పగలిగాడు.

మరింక ఆలస్యం దేనికి ఒకసారి యీ 'సంకలనా పొత్తాన్ని' కొనుక్కుని ('అరువు'గా కాదు -ముళ్ళపూడివారి అప్పుల అప్పారావులా అప్పు అడగకుండా) మీ కుటుంబమంతా కదిలి చదివేసుకోండి (సామూహిక పారాయణ అన్నమాట) నవ్వు కుంటారు, ఆనందిస్తారు, 'అబ్బా!' అని కూడా అనుకోకపోతే చూడండి!

అన్నయ్యా!  'ముందు మాట' ...మరో బుర్రతిరుగుడు (నాకు, నీకు అనుకునేవు)వ్రాయగలవా? వ్రాయాలి' అన్నాడు. నేనా? 'గలనా'? 'గలను' అనుకున్నాను. మరి దానికి నేను తగుదునో కాదో అని ఆ ప్రశ్నకు సమాధానం యివ్వలా. How do you think you are qualified? అని ఒక్కసారి నా ఇమోషనల్ మెడుల్లా (emotional medulla) అడిగేసింది- Do you think you deserve it? ఏమో? దానికీ సమాధానం చెప్పలా!

ఒక సారి సిస్టం ముందు కూర్చున్న తర్వాత ఆ కవితలని, కొన్ని  తిరగేశా మా మూర్తి వ్వాట్స్ అప్ లో. అన్నీ తన అభిమాన శ్రోతలకు చెప్పదగిన విషయాలే, సహృదయంతో, మంచి స్పందనతో, చిత్తశుద్ధితో  చక్కగా తన కవితను గానం చేశాడనిపించి, ఫరవాలేదు వ్రాయగలననిపించి, ఓ ప్రయత్నంచేశా, నాది అయిన పద్ధతిలో. మధ్యలో మన ప్రియతమ యోగి వేమన గారు గుర్తుకొచ్చి- 'ఆట వెలది' లో రాస్తే బావుణ్ణు, 'తేటగీతి' లో బావుణ్ణు, పోనీ 'ద్విపద' లోనైనా....అని సణుక్కున్నాను. నాలోని  సులక్షణ సారం (ఛందో వ్యాకరణ సంకలన గ్రంథం) అనే 'అహం' తన గోరోజనాన్ని చూపించింది.  'అతగాడు (రచయిత) ముందే వినయంగా ప్రార్థించాడోయ్, మరి నీ గొడవేంటి? ఊరుకో. అసలు బంధాల్లేని కవితే సర్వజనామోదం ముఖ్యంగా ఈ రోజుల్లో.... భావాల రాగాల పూత రేకుల దొంతరకు సంకెళ్ళేస్తే ఏం బావుంటుందోయ్'- ఇంకా"నీ ద్విపదేమిటి- చతుష్పాదుల్లో  రాస్తేనూ" అని నా బుద్ధి నన్ను సీరియస్ గా,ఘాటుగా మందలించింది. బుద్ధిగా కూర్చుని నా బుద్ధికి దాసుడినై ఆ బుద్ధికి తోచినట్లుగా వ్రాశాను....... మరి యిది రచయితకు (అంటే నీకు) చదువరులకు నచ్చుతుందో లేదో- మీ యిష్టం.

ప్రేమతో, ఆశీస్సులతో....
మా మూర్తికి స్వంత అన్నకాని అరువుకెళ్లిన ఓ అన్నయ్య!
చెఱుకుపల్లి భాస్కర శర్మ

# పాఠకులకు విజ్ఞప్తి

**ఉపోద్ఘాతం**

**మరో చిరుప్రయత్నం..... "చిరంజీవి"ది కాదు- నాదే!!!**

**లొల్లాయి పదాలు... వీటిల్ని "పద్యాలు అనలేక"!!!**

**సవర్ణదీర్ఘ సంధి సూత్రం:**

**(అ/ఇ/ఉ/ఋ)కు సవర్ణములైన అచ్చులు పరంబగునపుడు ఆ రెండింటికి కలిపి దీర్ఘము ఏకాదేశమగును. ఉదా: దేవ+ఆలయము=దేవాలయము భాను+ఉదయము=భానూదయము**

**(మీ అందరికీ కూడా గుర్తు చేద్దామని ఇది రాసాను)**

**"సవర్ణదీర్ఘ సంధి ఉదాహరణ చెప్పరా" అని మాష్టారు అన్నప్పుడు-**

**"చెంపకు చేయి పరంబగునప్పుడు కంటికి నీరు ఆదేశంబగును"అని తెలుగు మాస్టారికి చెప్పేయడం గుర్తు- అది విన్నమాస్టారు నా అతితెలివికి చెవి మెలియబెట్టడం వేరేసంగతి!**

**పద్యాలు అనలేని నేను "లొల్లాయి పదాలు" అనడానికి కూడా కొంత ధైర్యం ఎందుకు చేసానంటే- ఆరోజుల్లో,ఈ లొల్లాయి పదాలు, జానపదుల పెదాలమీద నాట్యమాడుతూ ఉండేవి;వీటికి హక్కుదారులు ఎవరూ లేరు-నానుడి, సామెతలాలాగా.ఓ విరుపుగా మాట్లాడినా, హాస్యమైనా, వ్యంగ్యమైనా, స్ఫూర్తిదాయకమైన,ఓ సందేశాత్మకంగా ఉన్నా-జానపదాల్లో చొచ్చుకు పోయేవి- రోజువారీ సంభాషణల్లో అప్రయత్నంగానే జనాల నిత్యజీవనంలో వారి సంభాషణల్లో ఈ పదాలు దొర్లేవి.**

**నేను అప్పటివాణ్ణి కాకపోయినా కొద్దిగా ఆ వాసనలతో పుట్టిపెరిగిన తరం వాణ్ని- ఈ తరమైతే కాదు -ఆ ఉద్దేశంతో వీటిని "లొల్లాయి పదాలు" అనే మాట ఖాయం చేసాను (మనలో మనమాట-కొత్తపదం కనిపెట్టలేక-ఏదో గుర్తుకొచ్చిన ఈ పదం వాడేసాను, పాఠకుల్లో ఉన్న పండితులెవరూ,నా ఈకలు పీకటానికి మాత్రం ప్రయత్నం చేయకండి- ఏదో పామరుణ్ణి, దొడ్డమనసుతో నన్ను వదిలేయండి)**

అంచేత, ఇవి నా లొల్లాయ పదాలు- వీటిని "పద్యాలు" అనే సాహసం చేయలేను-పద్యాలు అనే చెప్పాలని మనసులో ఉన్నా!

నా బాల్యంలో వల్లెవేసిన వేమన,సుమతీ శతకాల స్ఫూర్తితో కేవలం వారి శైలిని అనుకరించి ఈ 21 వ శతాబ్దంలో నేను చేసిన ఈ చిన్న ప్రయత్నాన్ని (అక్షర యజ్ఞాన్ని) పాఠకులు సహృదయంతో ఆదరిస్తారని ఆశిస్తున్నాను.ఏదో "నా మనసులో కలిగిన భావాలకు పద్యరూపంలో రాయడం జరిగింది" అంతే. తెలుగు భాషాభిమానంతో, చిక్కిన చక్కని సమాయావకాశం వల్లను , అన్నింటికన్నా ముందు ఆ "సరస్వతీదేవి" అనుగ్రహంతో నాలోని రచనపట్ల ఉన్న మక్కువను మెరుగుదిద్దుకుంటూ వివిధవిషయాల మీద రాయడం మొదలుపెట్టి, చిన్నకథల ప్రయత్నం నుండి, ఇదిగో ఇప్పుడు ఈ చిన్ని ప్రయత్నం ప్రయోగం చేశా.

చిన్నప్పుడు నేర్చుకున్న వ్యాకరణం- ఛందస్సు ఎప్పుడో మరుపాయే-"కంద అంటే ఆవపెట్టిన కందకూర, కందా-బచ్చలి కూర ఎలా చేయాలో",ఎంత రుచిగా ఉంటుందో తెలుసు, అలాగే "సీసమనగానే- సీసం గురించి అవగాహన ఉందిగానీ" కంద పద్యం, సీస పద్యమంటే బొత్తిగా గుర్తేలేదు- ఇప్పుడైతే ఆనవాలే పట్టలేను,వయసుకూడా మీరుతోందాయె; "మొదట విడతలో వాక్సిన్ వేయించుకున్న" వయసు గుంపులో వాణ్ని.ఏదో మనసుకొచ్చింది రాసిపారేసా-ఈసారి ప్రాసకోసం మాత్రంపాటుపడలేదు!

అలాగే "శార్దూలాలు, మత్తేభాలు, మత్తకోకిల" మరియూ "ఉత్పలమాల, చంపకమాల" (క్లాస్ లోని ఆడపిల్లల పేర్లు మాత్రం కాదు బాబు) ఇత్యాదుల గురించి చదివాం-పెద్ద అయిన తర్వాత వాటిలో కొన్నిటిని చూడటం జరిగింది, కానైతే వాటిజోలికి వెళ్లడం మాత్రం ప్రమాదం అని ఆ పని చేయడానికి మాత్రం సాహసించలేదు. నాలుగు పంక్తుల పద్యాలే- రోజుకొకటి చొప్పున ఒడ్డించుకొందు, ఆరగింపుకు సిద్ధమవ్వండి- ఇట్టే "అరిగిపోతాయి"-అంత మాత్రపు పూచి నాది- రుచికి మాత్రము కాదు!! వంటకం నా చేతిలో-రుచి మీ నాలిక మనసుని బట్టి- ప్రతి నాలికకీ మనసుంటుందని నా ఘట్టి నమ్మకం!

వీటిద్వారా సందేశాలు ఇచ్చేంత స్థాయి లేదు,నా బుర్రకి అవి తట్టే స్థాయీ లేదు; హాస్యప్రధానంగానే ఉంటాయి-కుర్చీలోంచి ఎగిరిపడేంత,కిందపడి బోర్లాపడిపోయి నవ్వుకునేంత కాదు కానీ- "ఓ బలవంతపు నవ్వు" మీ మొహంలోకి రావడం ఖాయం అని నేను నిర్ణయించేసుకున్నా- నన్ను నిరాశపరచరని చాలా ఆశ.

మీ మూర్తి
జీవితం చాలా అందమైనది.అది మీ చేతల్లో, చేతుల్లో...